


# పంతోపంతం

# దంతో దంతం

తెల్లారి ఎనిమిది అయేసరి కల్లా ఆరో అంతస్తులో ఉన్న ఆఫీసుకి చేరుకున్నాను. పొగమంచుతో దోబూచులాడుతోందా అన్నట్టు కిటికీ లోంచి దూరంలో గోల్డెన్ గేటు వంతెన కనిపిస్తోంది. పసిఫిక్ మహాసముద్రానికి, శాన్‌ఫ్రాన్సిస్కో అఖాతానికి మధ్యనున్న జలసంధి మీద అలవోకగా కట్టి పారేశారు. ఎన్ని రోజులు చూసినా ఇంకా ఆశ్చర్యమే! మరొక కిటికీ లోంచి చూస్తే శాన్‌ఫ్రాన్సిస్కో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దగ్గర విమానాల రాకపోకలు కనిపిస్తూ ఉంటాయి. అంత పెద్ద విమానం అమాంతం అలా గాలి లోకి ఎలా లేచి పోతోందో! ఇంజనీరింగు చదివి ఉండాల్సింది. అయినా ఇప్పుడు విచారించి ఏమి లాభం? గతజల సేతుబంధనం.

చేతులు కాలేక ఆకులు పట్టుకుని ఏమి లాభం అని వగచే విధానానికీ, నా ఉద్యోగ ధర్మానికీ పడదు. చేతులు కాలేకనే నా పని మొదలవుతుంది. నేనొక ప్రేతాలజిస్టుని. ప్రేతం అంటే శవం. శవాలని కొయ్యడం, కోసి ఆ ఆసామీ చావుకి కారణం ఏమిటో కూపీ లాగి కనుక్కోవడం నా వృత్తి. ఈ మాటని ఎంగ్లీషులో పేతాలజీ అంటారు. ఈ మాటకి తెలుగు సేత ప్రేతాలజీ.

ఇలా మేడ కిటికీ దగ్గర నిలబడి వంతెనలనీ విమానాలనీ చూస్తూ గాలిలో మేడలు కడుతూన్న సమయంలో ఎప్పుడో ఆర్డర్లీ వచ్చి ఆఫీసు బల్ల మీద అడుగెత్తు కాగితాల కట్ట పెట్టి వెళ్లిపోయాడు. అది ఆ వేళ చూడవలసిన కేసు. ఒడుపు చూసుకోకుండా ఈ అడుగెత్తు కాగితాలనీ చదవాలంటే అథమం ఆర్నెల్లు పడుతుంది. అందుకని పైనున్న అరంగుళం కాగితాలలో కేసు వివరాలన్నీ సంక్షిప్తంగా క్రోడీకరించి ఉంటాయి. ఆ క్రోడికని చదవడం మొదలు పెట్టేను. పక్క గదిలో శవం తయారుగా ఉంది.

స్థాలీపులాక న్యాయంలా – అంటే, అన్నం ఉడికిందో లేదో చూడ్డానికి ఒక్క మెతుకు చిదిమి చూస్తే ఎలా చాలో అలాగ – మొదటి పేజీ చదివేసరికి ఇదేదో క్లిష్టమైన వ్యవహారమేనని పసి కట్టేశాను. చనిపోయిన వ్యక్తి పేరు – ఆ పేరు ఏదైతే మనకెందుకు కానీ – మాట వరసకి మార్టిన్ అని అందాం. మార్టిన్‌కి ముప్ఫయ్ ఏండ్లు నిండేయేమో. మూడు నెలల క్రితం వరకు పిడుగులా ఉన్న మనిషి. జిర్రున చీదెరగడు. దుర్ వ్యసనాలేవీ లేవు. కండలు తిరిగిన జబ్బలు, కాయలు కాసిన చేతులు. ఏ కమ్మరి కొలిమి దగ్గరో పని చేసిన మనిషని సులువుగా చెప్పొచ్చు. అలాగని నేనేమీ ఊహించ నక్కర లేదు. అంతా మెడికల్ రిపోర్ట్‌లోనే రాసి ఉంది. మూడు నెలల క్రితం వరకూ ఉక్కు ముక్కలా దుక్కలా ఉన్న ఈ మనిషికి అకస్మాత్తుగా నుమోనియా వచ్చింది – రెండు ఊపిరితిత్తులలోనూ! హరీమనిపోయాడు.

శవాలని కొయ్యనప్పుడు ప్రేతాలజీ బోధించే ఉపాధ్యాయ వృత్తి నాది. అందుకని ప్రాణాలు తీసే నుమోనియా అంటే ఏమిటో ఒక్క పాఠం చెప్పనియ్యండి. నుమోనియా

వచ్చినవారి ఊపిరితిత్తులు వాచుతాయి. ఈ వాపు వల్ల తిత్తుల లోని గాలి బుడగలలో తెల్ల కణాలు, తదితర కణశకలాలు చేరి చిక్కుకు పోతాయి. దాంతో ఈ గాలి బుడగలలోకి మనం పీల్చే గాలి వెళ్లే అవకాశం తగ్గిపోతుంది. ఈ పరిస్థితి ముదిరితే శరీరానికి ప్రాణవాయువు సరఫరా తగ్గి పోయి, రోగి ఊపిరి ఆడక చచ్చి పోతాడు. ఇదీ టూకీగా నుమోనియా కథ.

నుమోనియా సాధారణంగా సూక్ష్మజీవుల వల్ల వస్తుంది. అందుకని మార్టిన్‌కి వచ్చినది నుమోనియా అని అనుమానం రాగానే రోగి ఉమ్మిని, కఫాన్ని కల్చరు చేసి చూసేరు. ఈ పరీక్షలని బట్టి సూక్ష్మజీవులు కాని, వైరసులు కాని, ఆఖరికి ఫంగసులు కాని కారణం కాదని వైద్యులు తేల్చి పారేసేరు. వాపుకి కారణం తెలియకుండా ఏ మందని వెయ్యగలరు? వేళ మించి పోకుండా కారణం తేల్చాలి. అందుకని ఊపిరితిత్తులలో చిన్న ముక్కని, బయాప్సీకని, కోసి తీసేరు. ఆ పరీక్షలవల్ల ఆ కణజాలం, లేదా టిస్యూ, బాగా దెబ్బ తిని పాడయిందని రూఢి అయింది తప్ప, ఎందుకు అలా పాడయిందో అర్థం కాలేదు. ఏమిటి చెయ్యాలో పాలు పోక మూడు నెలల పాటు వైద్యులు రాత్రింబవళ్లు ఆ రోగంతో పోరాడేరు. రోజులు గడుస్తూన్న కొద్దీ మార్టిన్ ఊపిరితిత్తులు మ్యూకస్‌తో నిండి దళసరిగా, అట్టముక్కలా తయారయాయి. హేమాహేమీలయిన వైద్యుల సమక్షంలో మార్టిన్ ఆఖరి శ్వాస విడచి కన్ను మూశాడు.

మార్టిన్ ఎందుకు చచ్చిపోయాడో తేల్చి చెప్పమని, మెడికల్ ఫైలంతటిని నా ఆఫీసుకి, శవాన్ని నా లేబుకి పంపించేరు. ఆరుద్ర గళ్ల నుడికట్టులా, అవసరాల రామకృష్ణారావు పజిలింగ్ పజిలులా, న్యూయార్కు టైమ్సు వారి క్రాస్‌వర్డ్ పజిల్‌లా ఈ కేసు నన్నెలా అల్లరి పెట్టిందో, అలగ్జాండరు గుర్రాన్ని లొంగదీసినట్లు, దీన్ని ఎలా సాధించేనో చెబుతాను, సావధానంగా చిత్తగించండి.

ప్రతి మనిషి చిట్టాలోను చిత్రగుప్తుడు ఏమిటి రాస్తాడో ఎవరికీ తెలియదు కానీ, ఈ అమెరికాలో మాత్రం ప్రతి మనిషి చిట్టాలోను ఆఖరి సంతకం ప్రేతాలజిస్టుదే. ఆ సంతకం కొరకు ఈ కాగితాల దొంతర నా దగ్గరకి వచ్చింది. ఆ సంతకం పెట్టే ముందు నేను చేసే పని పక్కా పత్తేదారీ పని. ఇంకా మీన మేషాలు లెక్క పెడుతూ కూర్చోడమెందుకని కుర్చీలోంచి లేచేను. తొమ్మిదవుతోంది.

కాలి బొటనవేలికి తగిలించిన చీటీ మీద పేరు చూసుకొని, సరైన శాల్తీనే పరీక్షిస్తున్నానని నిర్ధారణ చేసికొని, పనికి ఉపక్రమించేను. బ్లేడుని హేండిల్‌లో అమర్చి, బలంగా ఎముకలు తగిలే వరకు కత్తిని లోతుగా పోనిచ్చి ఒక కోత కోసేను. నిజానికి అలాంటి కోతలు మూడు కోసేను. కుడి భుజం దగ్గర మొదలు పెట్టి ఉరోస్థి అధోభాగం వరకు ఒక కోత, ఎడమ భుజం దగ్గర మొదలు పెట్టి అదే విధమయిన కోత మరొకటి, ఉరోస్థి అధోభాగం నుండి తిన్నగా పొత్తికడుపు కింది భాగం దగ్గర కటిస్తానంలో ఉన్న వస్తికాస్తి వరకు మూడో కోత. ఈ మూడు కోతలతోటీ మొండెముని కప్పే చర్మాన్నంతటినీ పక్కకి తప్పించ వచ్చు.

తర్వాత పక్క ఎముకలని తలుపు తీసేసినట్టు తీసేసి, శ్వాసనాళిక పట్టు నుండి ఊపిరితిత్తులని కోసి, వాటిని పంజరంలోంచి చిలకని తీసినట్టు పైకి తీసేను. పీచు మిఠాయిలా తేలికగా, దూది పింజలలా ఉండవలసిన తిత్తులు, రెండూ కలిపి, ఉరమరగా ఒక కిలో బరువున్నాయి. నా ఆశ్చర్యానికి అంతు లేదు.

శవం ఉదర కుహరంలో ఉన్న అవయవాలన్నింటిని మరొకసారి పరీక్షించి, అవసరమైన కణజాలాన్ని సేకరించి – వీటినే `బయాప్సీలు' అంటాం, మా పరిభాషలో – శవాన్ని కుట్టేసి, కట్టెని అయినవారికి అప్పజెప్పమని ఉత్తర్వు జారీ చేసి, చేతులు కడుక్కొని ఆఫీసులోకి వచ్చేసరికి దరిదాపు పన్నెండు అయింది. బయాప్సీ కొరకు తీసిన కణజాలాలన్నిటిని స్లయిడ్‌గా చెయ్యడానికి లేబుకి పంపించి, మధ్యాహ్నం పాఠం చెప్పే ప్రయత్నంలో పడ్డాను.

కొన్నాళ్లు పోయిన తర్వాత లేబుకి పంపిన స్లయిడ్‌లు తయారయి వచ్చేయి. శవాల దగ్గర కూర్చుని (నిజానికి, నిలబడి) కోసే కోతల కంటె, సూక్ష్మదర్శిని దగ్గర ఒంగుని చూసే చూపుల దగ్గరే మా ప్రేతాలజిస్టుల కాలం గడిచి పోతుంది. కోతలన్నీ యాంత్రికంగా జరిగి పోతాయి. స్లయిడ్‌లు తనిఖీ చేసేటప్పుడు బుర్రకి పని చెప్పాలి. చెప్పేను. స్లయిడ్‌లని చూడగా, చూడగా, మార్టిన్ ఊపిరితిత్తులు అంత బరువుగా ఎందుకు ఉన్నాయో అర్థం అవడం మొదలయింది.

మరొక పాఠం. ఆరోగ్యవంతులైన వారి ఊపిరితిత్తుల నిండా చిన్న చిన్న గాలి సంచులు ఉంటాయి. మనం గాలి పీల్చినప్పుడల్లా ఈ సంచులు గాలితో నిండుతాయి. ఈ గాలి సంచులకావలి వైపున కేశనాళికలు దట్టంగా అల్లుకుని ఉంటాయి. శరీర ప్రక్రియలతో అలసిపోయి, ఆమ్లజని కోసం ఆవురావురు మంటూన్న మలిన రక్తం ఈ కేశనాళికలలో ఉంటుంది. అప్పుడు గాలిసంచులలో ఉన్న గాలి లోని ఆమ్లజని రక్తం లోకి, రక్తం లోని బొగ్గుపులుసు గాలి గాలిసంచులలోకి తారుమారు అవుతాయి. రక్తం శుభ్ర పడుతుంది. ఈ ప్రక్రియ సజావుగా జరగాలంటే ఈ గాలిసంచుల గోడలు శుభ్రంగా, ఏ అడ్డంకులు లేకుండా ఉండాలి. కాని మార్టిన్ ఊపిరితిత్తులలోని గాలిసంచుల నిండా నానావిధములైన కణ శకలాల పెంటా ఉంది. (దీనినే ఇంగ్లీషులో `టిస్యూ డెబ్రీ' అంటారు.) అందువల్ల, గాలి లోపలికి వెళుతున్నాది కాని, ఆ గాలి లోని ఆమ్లజని రక్తానికి అందడం లేదన్న మాట. `అత్తారింట ఎన్ని పిండివంటలు వండితే మాత్రం ఏమి లాభం, అల్లుడి నోట్లో శని ఉంటే' అంటారే అలాగ అయింది మన మార్టిన్ పని. పాపం! గాలి పీల్చ గలిగినా ఊపిరి అందక చచ్చిపోయాడు.

ఇక్కడితో పరిశోధన ఆపేస్తే మా పత్తేదారీతనంలో పస ఏముంటుంది? పేదరాసి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా,.... అన్న కథలోలా, ఊపిరి ఆడక పోవడానికి గాలిసంచులలోకి కణ శకలాల పెంట చేరడం కారణం అయితే, ఆ పెంట అక్కడకి ఎందుకు చేరింది అన్నది

తర్వాత వచ్చే ప్రశ్న. ఏమిటి జరిగిందో తెలిసింది కానీ ఎందుకు జరిగిందో తెలియ వలసి ఉంది. ఎంత బుర్ర గోక్కున్నా ఈ సమస్యకి అంతూ, పై తెలీకుండా పోతోంది.

పేషెంటుని ఆసుపత్రిలో చేర్చిన రోజున రోగి చరిత్రని క్షుణ్ణంగా రాసుకోవాలి. ఈ పనిని మెడికల్ కాలేజీ విద్యార్థులకి రివాజుగా అప్పజెబుతాం. మార్టిన్ ఆసుపత్రిలో చేరిన రోజున విద్యార్థి రాసిన చరిత్ర చదవడం మొదలు పెట్టేను.

ఆసుపత్రికి వచ్చే ముందు రోగి వంట ఇంట్లో ఏదో వండుతున్నాడుట. అకస్మాత్తుగా దగ్గు, తుమ్ములు రావడం మొదలయాయిట. దాంతో ఊపిరి ఆడ లేదుట. పరిగెత్తుకుని ఆసుపత్రికి వచ్చేరుట. ఈ విషయాలన్నీ మార్టిన్‌ని ఆసుపత్రికి తీసుకు వచ్చిన స్నేహితురాలు చెప్పిందిట. తనకి ఆసుపత్రుల పొడ పడదంటూ, తనని ఆసుపత్రికి తీసుకొచ్చిన స్నేహితురాలినీ, పరిచర్యలు, పరిక్షలు చేసిన నర్సులని పడ తిట్టేడుట - ఒక పక్క దగ్గుతూనే. ఇన్‌ఫెక్షన్ ఏదో అయి ఉంటుందన్న అనుమానంతో వైద్యులు ఏవో మందులు ఇచ్చేరుట. అసుపత్రిలో చేర్చి రెండురోజులు పర్యవేక్షణలో ఉంచడం మంచిదని వైద్యులు ఎంత చెబుతున్నా వినిపించుకోకుండా విసురుగా ఇంటికి వెళ్లిపోయాడుట. మర్నాడే మళ్లా దగ్గు, ఆయాసంతో ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యక్షం అయేడుట. ఒళ్లంతా నీలంగా అయిపోయి ఉందిట. ఇదీ ఆ ఎడ్మిషన్ రిపోర్టు సారాంశం.

శరీరం అంతా నీలంగా అయిపోవడంలో అంత చెప్పుకోదగ్గ వింత, విడ్డూరమూ ఏమీ లేవు. నుమోనియా వచ్చినా, ఊపిరితిత్తులకి సోకుడు (ఇన్‌ఫెక్షన్) తగిలినా, ఊపిరితిత్తులకి దెబ్బ తగిలినా శరీరం నల్లగా అవచ్చు. దాని వల్ల కొంప మునిగే అంత ప్రమాదం ఏమీ లేదు. కాని ఈ వ్యవహారం అంతా ఇంత త్వరగా, ఒక్క రోజులోనా? అసంభవం! మనకి అర్థం కానిదేదో ఉంది. ఇది నిజంగా పజిలింగ్ పజిలే.

మార్టిన్ గర్ల్ ఫ్రండుకి ఫోను చేసేను. ఆమె ఇంటి దగ్గర కాదు కదా ఊళ్లోనే లేదుట. ఎమర్జెన్సీ వార్డులో ఎడ్మిట్ చేసికొన్నప్పుడు, మార్టిన్ ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో ఆ కంపెనీ పేరు, అతని యజమాని పేరు, ఆ యజమాని టెలిఫోను నంబరు మొదలయిన వివరాలన్నీ మొదటి పేజీలోనే రాసి ఉన్నాయి. మొదట్లో నర్సులు ఈ వివరాలు అడిగినప్పుడు, "ఈ యక్ష ప్రశ్నలన్నీ ఇప్పుడెందుకు? వెధవ సోదిలా ఉంది. ఒక పక్కన ప్రాణాలు పోతూ ఉంటే" అని పేషెంట్లు సాధారణంగా చిరాకు పడడం కద్దు. కాని, కాలక్షేపానికీ, కొంటె ప్రశ్నలు వేస్తూ కూర్చుందుకీ, ఎమర్జెన్సీ వార్డు నర్సులకి తీరుబడి ఉండదు. అత్యవసరమైన ప్రశ్నలే అడుగుతారు.

మార్టిన్ పని చేసిన కంపెనీ యజమానికి ఫోను చేసేను. నన్ను నేను పరిచయం చేసికొన్నాను. మార్టిన్ మరణానికి కారణం ఏమిటా అని శోదా చేస్తున్నానని కూడా చెప్పేను. కొన్ని ప్రశ్నలడుగుతాను, వాటికి సమాధానాలు చెప్పగలరా అని వాకబు చేసేను. అవతల నుండి ఎప్పటికీ సమాధానం రాకపోయే సరికి, కనెక్షన్ పోయిందేమోనని,

''అవతల ఎవరయినా ఉన్నారా?'' అని రెట్టించి అడిగేను.

''అడగండి, తెలిసినంత మట్టుకి చెబుతాను'' తూచి, తూచిన మాటలు నాలుగు ఒలికేయి.

''మీ ఫౌండ్రీలో మార్టిన్ ఏ పని చేసే వాడు?''

''అల్లూమినం కరిగించి మూసలలో పోసే వాడు.''

''అసలు మార్టిన్ గురించి మీరేమిటి చెప్పగలరు?''

''అతను సామంతుడు. అంతకంటె నేనేమి చెప్పగలను?''

''అంత సామంతుడు ఎలాగయాడో!'' ప్రశ్నార్థకం కాకుండా ఆశ్చర్యార్థకం ధ్వనించేలా అన్నాను.

''పుర్రెలో బుద్ధి పుట్టాలే గానీ గణించడానికి మార్గాలే లేవా?''

''డిక్కీలో తొంగోబెట్టేసే రకం ఏమిటి?''

''ఆ ఉద్దేశంతో అన లేదు.''

మాట తూచి తూచినట్టు వినిపించింది. మరే ఉద్దేశంతో అన్నాడో కనుక్కోవాలని అనిపించింది కానీ మరీ క్రాసు ఎగ్జామినేషన్ చేసినట్లు ప్రశ్నలు అడిగితే ఎక్కడ బిగుసుకు పోతాడో నని భయపడి, కొంచెం ప్లేటు ఫిరాయించేను.

''మార్టిన్ కోపిష్టి మనిషా?''

''మార్టిన్ చాలా నెమ్మదస్తుడు.''

''మార్టిన్ ఏదో వంట వండుతూ ఉన్న సమయంలో దగ్గు, ఆయాసం వస్తే ఎమర్జెన్సీ వార్డుకి తీకుకొచ్చేమని అతని స్నేహితురాలు చెప్పింది. ఏమిటి వండుతూ ఉండగా దగ్గు వచ్చిందో తెలిస్తే కొంచెం ఆచూకీ దొరికుండేది....''
అంటూ వాక్యాన్ని అర్థోక్తిలోనే ఆపేసేను. ప్రశ్న రూపంలో అడగలేదు కనుక ఇష్టం ఉంటే సమాధానం చెబుతాడు, లేకపోతే లేదన్నట్లు ఊరుకున్నాను. అవతల పక్క నుండి సమాధానం ఏమీ రాలేదు.

అవతల వ్యక్తి మౌనంలో అంతరార్థం ఏమయినా ఉందేమోనని నా అంతరాత్మ అలజడి చెందింది. అయినా ధైర్యం చేసి అడిగేను.

''మార్టిన్ అంత సామంతుడు ఎలాగయ్యాడో? ఫౌండ్రీలో కమ్మరి పని చేసి ఎంతని వెనకెయ్య గలడు?''

మరి కొంత సేపు నిశ్శబ్దం. తొందర పడ్డానేమోనని నాలిక కరుచుకున్నాను. కాని నా రొట్టి విరిగి నేతిలో పడింది.

''మార్టిన్‌కి ఒక హాబీ ఉండేది. ఊళ్లో ఉన్న దంత వైద్యుల దగ్గరకి వెళ్లి, పాత పళ్లు పోగు చేసి, వాటిల్లో ఉండే బంగారం వెండి మలామాలు పోగు చేసే వాడు.''

''ఆ లోహాన్ని ఏమి చేసే వాడో....'' అడిగీ అడగనట్లు అడిగేను.

''నా కేమి తెలుస్తుంది? అడిగితే మాత్రం చెబుతాడా? ఆ స్నేహితురాలికి నగలు చేయించేడేమో!''

తెలీదంటూనే నాకు కావలసిన విషయం కూడా ఒకటి నా చెవిన పడేసేడు. గత సంవత్సరంలోనే స్నేహితురాలితో కలసి మూడు సార్లు కొలంబియా వెళ్లి వచ్చేడుట. డబ్బుంటే హవాయి వెళతారు. ఇంకా ఉంటే పోనీ పేరిస్ వెళితే అర్థం ఉంది. లేక పోతే ఏ పడవలోనో లహరు (అంటే, 'క్రూజ్') కి వెళతారు. కాని కొలంబియా వెళ్లడం కొంచెం ఎబ్బెట్టుగా కనిపించింది. కొంచెం తటపటాయిస్తూనే,

''మార్టిన్ డ్రగ్స్ కానీ వాడే వాడా?''

''మార్టిన్ డ్రగ్స్ వాడడం నేనెప్పుడూ స్వయంగా చూడ లేదు.''

కర్ర విరగకుండా, పాము చావకుండా, గోడ మీద పిల్లిలా సమాధానం వచ్చింది. అందులోనూ 'స్వయంగా' అన్న మాటని కొంచెం నొక్కి పలికేడు. తునిలో పుట్టి, తునిలో పెరిగి, తుని తగువులని తేర్చే తగవరులని స్వయంగా చూసిన నేను పై సమాధానంలోని సొగుసుని, అంతరార్థాన్ని గమనించలేక పోతే ఎందుకింక ఈ బతుకు?

మార్టిన్ మహాశయుని జీవిత సంగ్రహం మెల్లిగా నా కండ్ల ముందు విడడంమొదలు పెట్టింది. దంతవైద్యుల దగ్గర కానీ, శవసంరక్షకుల దగ్గర కానీ పాత పళ్లు పోగు చేసి, కమ్మరి కర్మాగారంలోని తన అనుభవాన్ని పురస్కరించుకొని, ఆ పళ్లల్లో ఉన్న బంగారాన్ని, వెండిని కరగించి, ఆ డబ్బుతో కొలంబియాలో డ్రగ్స్ కొని, వాటిని ఇక్కడికి స్మగుల్ చేసి, ..... , అమ్మ ఛడవా! మార్టిన్ మస్తిష్కపు చురుకుతనానికి ముక్కు మీద వేలేసుకున్నాను.

కాని మార్టిన్ కొలంబియా వెళ్లి అక్కడ డ్రగ్గులు స్మగుల్ చెయ్యడానికి, అతని అకాల మరణానికి మధ్యనున్న అవినాభావ సంబంధమేమిటో నాకు బోధ పడ లేదు. ఇదేదో తేల్చి ఈ కేసుని మూసెయ్యక పోతే రేపో, మాపో కోరొనర్ కచేరీ నుండి చివాట్లతో శ్రీముఖం వస్తుంది. ఇంక ఈ పని తొందరగా తెమల్చాలి.

మా యూనివర్శిటీలో ఒక దంత వైద్య పాఠశాల కూడ ఉంది. అక్కడ నాకు తెలిసిన ఒక ప్రొఫెసర్‌ని టెలిఫోనులో పిలచి దంతవైద్యంలో ఉన్న మెలికలు కొంచెం నా బోంట్లకి అర్థం అయేలా వివరించమని అడిగేను. ఆ సంభాషణ సారాంశం ఇది.

అమెరికాలో పుచ్చుతూన్న పళ్లని ఠపీమని పీకి పారెయ్యరు. పుచ్చుతూన్న భాగాన్ని బాగా శుభ్రం చేసి, మరికొంచెం దొలిచి, ఆ రంధ్రంలో కరిగించిన వెండిని కాని, బంగారాన్ని కాని పోసి నింపుతారు. పరిశుద్ధమైన బంగారం కొంచెం మెత్తగా ఉంటుంది. అటువంటి బంగారాన్ని ఆ పళంగా వాడేస్తే, ఏ అప్పడాలో నములుతూ ఉన్నప్పుడు, ఆ బంగారం కాస్తా తన కుదుట్లోంచి బయటకొచ్చి పళ్లకింద పడిందంటే మనకొక బంగారపు అప్పడం బయటకి వస్తుంది. అందుకని బంగారాన్ని ఏ పెల్లేడియం వంటి లోహం తోటో కలిపి

ఆ మిశ్రమ లోహపు ముద్దని పళ్లు నింపడానికి వాడతారు. అలాగే వెండిని వాడినప్పుడు, వెండిని పాదరసంతో కలుపుతారు. ఇలా పాదరసంతో కలిపిన వెండిని రసరజితం అంటారు.

పళ్లకి ఎంత శుశ్రూష చేసి జాగ్రత్త పడ్డా, ఎప్పుడో ఒకప్పుడు ఈ పళ్లు ఊడక తప్పదు. అప్పుడు వాటిల్లో ఉన్న బంగారాన్ని సేకరించ వచ్చు. ఇది చాల తేలికైన పనే. ఇక్కడొక చిన్న రసాయన పాఠం. బంగారం పెల్లేడియం కలిపిన మిశ్రమాన్ని వేడి చేస్తే, ముందుగా బంగారం 1165 డిగ్రీలదగ్గర కరుగుతుంది. కాని పెల్లేడియం 1552 డిగ్రీల వరకు కరగదు. కనుక బంగారం పెల్లేడియం కలిపిన మిశ్రమంతో నింపిన పుప్పి పళ్లని వేడి చేస్తే, ముందు బంగారం కరిగి బయటకు వచ్చేస్తుంది.

ఇప్పుడు ధరలు కొంచెం ధరలు అందుబాటులోకి వచ్చేయేమో కాని, ద్రవ్యోల్బణం, దివాలేషం వెర్రితలలు వేసిన ఆ రోజుల్లో (అంటే, 1978 ప్రాంతాలలో) బంగారం అవున్సు 800 డాలర్లు చొప్పున, వెండి అవున్సు 15 డాలర్లు చొప్పునమ్ముడు పోయేది. ధరలు ఇంకా పెరిగిపోతాయన్న అత్యాస కొద్దీ చాల మంది బంగారం, వెండి కొని వెనకెయ్యడం మొదలు పెట్టేరు. కొనే స్థోమత లేని వాళ్లు ఏ ఏటి గట్టుకో వెళ్లి, పెనంలో ఇసకని పోసి, గాలించి బంగారపు నలుసుల కొరకు వెతికే వారు. కాని కొలిమిలో లోహాలని కరిగించడం మార్టిన్‌కి చేతిలో ఉన్న విద్య. అందుకని కట్టుడు పళ్లలో బంగారాన్ని, వెండిని సేకరించాలని బుద్ధి పుట్టి ఉంటుంది. పైన చెప్పిన పద్ధతిలో మార్టిన్ బంగారాన్ని విడగొట్టి, దాన్ని అమ్ముకుని, ఆ డబ్బుని కొలంబియా పట్టుకెళ్లి, అక్కడ డ్రగ్స్ కొని, వాటిని దొంగచాటుగా అమెరికాలోకి రవాణా చేసి, డబ్బు గణించి ఉంటే ఇప్పటికీ నిక్షేపంగా ఉండేవాడే.

కాని పళ్లల్లో కూడ బంగారాన్ని ధరించగల భాగ్యవంతులు ఈ అమెరికాలో కూడా ఎంతో మంది లేరు. వెండి అవున్సు ధర సాధారణంగా మూడు, నాలుగు డాలర్లకి మించదు. అందుకని పళ్లల్లో రసరజితాన్ని వాడే వారు కొల్లలుగా ఉండేవారు. బంగారం అయితే నేమిటి, వెండి అయితే నేమిటి అని అనుకొని, పేరాశని అదుపులో పెట్టుకో లేక, అవివేకి అయిన మన మార్టిన్ ఈ వెండినే పోగు చెయ్యడానికి సంసిద్ధుడై పప్పులో కాలేసి ఉండాలి.

పాదరసం గది ఉష్ణోగ్రత దగ్గర ద్రవ పదార్థమని మనందరికీ తెలుసు. కాని పాదరసం 674 డిగ్రీల దగ్గర మరిగి కావిరి అవుతుందని చాలమందికి తెలియదు.అంటే, రసరజితాన్ని వేడి చేసినప్పుడు ముందు పాదరసం కావిరి అయి పోతే, మూసలో వెండి మిగిలి పోతుంది. కాని రసరజితంతో నింపిన దంతాలని వేడి చేసి, వాటి లోని వెండిని సంగ్రహించడంలో కొన్ని ప్రయోగాత్మకమయిన ఇబ్బందులు లేక పోలేదు. తమాషా ఏమిటంటే, పాదరసం ద్రవరూపంలో ఉన్నంత సేపు ఏమీ హాని చెయ్యదు. నోట్లో వేసికొని మింగినా మరేమీ ప్రమాదం లేదని కొందరు గడుగ్గాయిలు రుజువు చేసి చూపించేరు కూడా. అలాంటి పాదరసం మరగి కావిరి అయిందంటే రంగు, రుచి, వాసన లేని విషవాయువుగా మారిపోతుంది. ఈ

వాయువుని పీల్చితే అది శరీరంలోని రక్తంతో సంయోగం చెంది – బాంబు పేలితే భవనాలు శిధిలం అయినట్లు – కణజాలాలతో నిర్మితమైన కుడ్యాలని ఛిన్నాభిన్నం చేస్తుంది. (ఈ రకపు విద్యా గంధం మన మార్టిన్‌లోనే కాదు, చాల మంది చదువుకున్న వారిలోనే పూజ్యం.) ఇదెలా జరుగుతుందో వివరించి చెబుతాను.

రక్తం లోని ఎర్ర కణాలకి ఎరుపు రంగు నిచ్చే పదార్థాన్ని రక్తచందురం అంటారు. ఈ రక్తచందురం లోని అణువుల నిర్మాణక్రమం ఆమ్లజనిని మోసుకొని వెళ్లడానికి వీలుగా ఉంటుంది. ఇలా ఆమ్లజనిని మోసుకెళ్లే కార్యక్రమం అంతా సజావుగా జరగడానికి రక్తంలో అజములు అని కాని, ఫేనకప్రాణ్యములు అని కాని పిలవబడే కొన్ని రసాయన పదార్థాలు ఉన్నాయి. వీటినే ఇంగ్లీషులో `ఎంజైము` లంటారు. పాదరసపు కావిరులు ఊపిరితిత్తులలోకి వెళ్లగానే ఈ ఆజములు ఆమ్లజనిని గ్రహించడానికి బదులు పాదరసపు అణువులతో ఢీకొని వాటిని అణుశకలాలుగా మార్చేస్తాయి. ఈ పాదరసపు అణుశకలాలు, లేదా `అయాను`లు, చాల చురుకైనవి, తద్రూపేణా, ప్రమాదమైనవి. శరీరం లోని కణజాలాలని ధ్వంసం చేసి పెంట పోగులుగా మార్చగల సామర్థ్యం కలవి. ఈ పాదరసపు అణుశకలాలు మెదడులోకి వెళ్లేయంటే, అక్కడ నానా అల్లరి పెట్టగలవు. అందువల్లనే మార్టిన్ మొదటి రోజున నర్సుల మీద రంయ్ రంయ్ మని ఎగిరి ఉంటాడు.

ఇంత వరకు చేసిన పత్తేదారీ ఆంతా శుద్ధ సిద్ధాంతం మాత్రమే. ఇప్పుడు చెయ్య వలసినదల్లా ఈ సిద్ధాంతం నిజమని నిర్ధారణ చెయ్యడమే. శవ పరీక్షలో సేకరించిన కణజాలాల మచ్చులు ఇంకా నా దగ్గర ఉన్నాయి. వాటిని మళ్లా పరిశోధన శాలకి పంపేను. పాదరసం యొక్క అవశేషాలు ఉన్నాయేమో ప్రతేకం చూడమని ఒక చిన్న చీటీ రాసి పంపేను. మర్నాటికి నా అనుమానం నిజమేనని రూఢి అయింది. మార్టిన్ పాదరసపు విషవాయువులు పీల్చిన కారణం గానే చచ్చిపోయాడు.

నా సిద్ధాంతం కొంత వరకు రుజువయింది. ఈ పాదరసపు విషవాయువులు మార్టిన్ ఎక్కడ పీల్చేడో తెలిస్తే కాని కేసు ముగింపుకి రాదు. ఈ విషవాయువులు పని చేసే కమ్మరి కొలిమి దగ్గర పీల్చి ఉంటే, ఆ కొలిమి యజమాని మీద ప్రభుత్వం వారు కాని, మార్టిన్ వారసులు కాని దావా వెయ్య వచ్చు. ఈ ప్రమాదమేదో ఆ వంట గదిలోనే జరిగి ఉంటే, తను తవ్వుకున్న గోతిలో తనే పడ్డాడని సంజాయిషీ చెప్పుకుని ఊరుకోవచ్చు. ఏది ఏమయినా, ఈ విచారణ నా పదవీ ప్రభావపు పరిధికి మించిన పని.

అమెరికాలో, `ఓషా` అనే సంక్షిప్త నామధేయంతో, `ఆక్యుపేషనల్ సేఫ్టీ ఎండ్ హెల్త్ ఎడ్మినిస్ట్రేషన్` అనే ప్రభుత్వ శాఖ ఉంది. వృత్తి రీత్యా జరిగిన ప్రమాదాలని పరిశీలించి, తగిన చర్య తీసికొనే భాద్యత వారిది. ఇటు పైన ఈ సమస్య వారి అధికార మండలం లోకి వెళుతుంది. అందుకని తరువాయి పరిశోధనా తతంగాన్ని వారికి అప్పచెప్పేను. వారి సిబ్బందిలో కొందరు మార్టిన్ ఇంటికి, మరి కొందరు మార్టిన్ పని చేసిన కార్ఖానాకి వారంట్లు

పుచ్చుకుని తరలి వెళ్లేరు. మార్టిన్ చచ్చిపోయి మూడు నెలలు కావస్తోంది. అయినప్పటికీ, మార్టిన్ వంటయింటి నేల కిందా, నేలమాళిగ లోనూ పాదరసపు అవశేషాలు విరివిగా కనిపించేయి. మార్టిన్ తన సొంత వంటగది లోనే దంతాల వంట చేసేడనడానికి ఇంత కంటె ఇంకేమి దాఖలాలు కావాలి?

శల్యపరీక్షగా మారిన మార్టిన్ శవపరీక్ష ఈనాటికి పూర్తి అయింది. పాదరసపు విషవాయువులు ఊపిరితిత్తులలోని గాలి బుడగలని ధ్వంసం చేసిన కారణంగా, ఊపిరి అందక మార్టిన్ చచ్చిపోయాడని తీర్పు చెప్పి, సంతకం పెట్టి, కాగితాల కట్టని కోరొనర్ కచేరీకి పంపేను. అలా రాసి సంతకం పెట్టేనే కాని, మార్టిన్ చావుకి అసలు కారణం అతని అవిద్య, అవివేకం, అత్యాస అని నాకు తెలుసు.

ఇంతటితో నా భాద్యత తీరింది కాని కథ కంచికి వెళ్ల లేదు. అమెరికాలో 'డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధారిటీ' అని మరో ప్రభుత్వ సంస్థ ఉంది. తరువాయి దర్యాప్తు వారిది. కొలంబియాలో మార్టిన్‌తో చెయ్యి కలిపిన వారెవరో ఆచూకీ తీసి, ఆ బృందం అంతటినీ పట్టుకుని కోర్టుకి ఎక్కించే భాద్యత వారిది. అందుకని వారు చేసే దర్యాప్తులన్నీ పరమ రహస్యం. కనుక తరువాయి కథ నాకు తెలియదు.

ఆఖరి మాట: మార్టిన్ కేసుని దృష్టిలో పెట్టుకునో, ఏమో - అమెరికాలో ఇప్పుడు రూల్సు మార్చేసేరు. ఈ రోజుల్లో దంత వైద్యులు పీకేసిన పాత పళ్లు ఇమ్మంటే ఇవ్వరు. ఈ వ్యవహారం ఎంత వరకు ముదిరిందో మనవి చేసికొని ఈ ఉదంతాన్ని ఉపసంహరించుకుంటాను. మన దేశంలో పాల పన్ను ఊడినప్పుడు పిల్లలు ఆ పంటిని ఎలక కన్నంలో వేసి, "ఎలకా, ఎలకా, ఈ పాల పన్ను తీసికొని గట్టి పళ్లు ఇవ్వవా?" అని అడుగుతారు. అలాగే అమెరికాలో ఒక సంప్రదాయం ఉంది. ఊడిన పాల పంటిని పిల్లలు దిండు కింద పెట్టి పడుక్కుంటారు. రాత్రి దంతదేవత (టూత్ ఫేరీ) వచ్చి ఆ పంటిని తీసికొని వాళ్ల తలగడ కింద చిన్న బహుమతిని పెట్టి వెళుతుంది. (నిజంగా తమ తమ తల్లిదండ్రులో, నానమ్మలో ఈ దంతదేవతలని గడుగ్గాయిలయిన పిల్లలకి తెలుసనుకొండి.) అప్పుడప్పుడు ఒదులుగా ఉన్న పంటిని, ఊడే వరకు ఆగకుండా దంతవైద్యులు పీకేస్తారు. పూర్వం అలా పీకేసిన పంటిని పొట్లం కట్టి పిల్లలకి ఇచ్చేవారు. ఇప్పుడు, పీకేసిన పళ్లని కావాలని అడిగినా, ఇవ్వడానికి వీలు లేదని చెప్పేస్తున్నారు.

(డేనియల్ వీవర్ రాసిన కథ దీనికి ఆధారం)

(రచన సెప్టెంబరు 93 సంచికలో ప్రచురించబడింది.)